ఉత్తమ సాహిత్యం జిందాబాద్

కాలనీ వాళ్ళందరం పిల్లలతో సహా వేదిక దగ్గర సమావేశమయ్యాము.

సాధారణంగా ఇలాంటి సమావేశాల్లో కనిపించే ఉత్సాహం, హడావుడి, అరుపులూ కేకలూ– ఏమీ కనిపించడం లేదా రోజు.

అంతా అతి భయంకరమైన నిశ్శబ్దం అలుముకుని వుంది.

అందరి ముఖాల్లోనూ వ్యాకులత, భయం, దిగులు అలుముకుపోయినాయ్. నేనూ రంగారెడ్డి, గోపాల్రావ్, యాదగిరి, జనార్దన్, చంద్రకాంత్ విచారంగా ఓ పక్కన కూర్చున్నాం. శాయిరామ్ నెమ్మదిగా వచ్చి వేదిక ఎక్కి మైక్ ముందు నిలబడ్డాడు దీనంగా.

చిన్న చిటికె వేసినా వినిపించేత నిశ్శబ్దం.

"సోదర సోదరీమణులారా! ఇవాళ మనకు చాలా విచారకరమయినా రోజు. మన కాలనీలోని డజనుమంది టెన్త్ విద్యార్థులు– పెద్దలకు తెలీకుండా– రహస్యంగా అతి జుగుప్సాకరమయిన సాహిత్యం చదువుతుండగా పట్టుబడ్డారు. పన్నెండుమందీ కూడా భయంకరమయినా చెడుమార్గంలోనే ప్రయాణిస్తున్నారంటే కాలనీలోని మిగతా పిల్లలు కూడా ఇదే త్రోవలో నడుస్తున్నారని వేరే చెప్పడం అనవసరం అని నా అభిప్రాయం. కనీసం ఇప్పటికయినా మన కాలనీ పిల్లలు ఎలాంటి పుస్తకాలు చదువుతున్నారో వారి

తల్లిదండ్రులతో పాటు ఇతరులు కూడా తెలుసుకుంటే భవిష్యత్తులో వారు అలాంటితప్పు మార్గంలో వెళ్ళకుండా నివారించడానికి అవకాశం ఉంటుందని నా ఆశ. అందుకే ఈ రోజు ఈ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయవలసి వచ్చింది."

ఇంతవరకూ చెప్పి అందరి వంకా ఓసారి చూశాడు శాయీరామ్, అందరి చూపులు తనమీదే నిలచివుండడంతో మరింత విచారంగా ఫోజుఇస్తూ మళ్ళీ ప్రారంభించడాతను.

"ముందుగా యాదగిరినీ, అతని కొడుకు శంకర్‌ని వేదిక మీదకు రావలసిందిగా కోరుతున్నాను" అన్నాడతను.

యాదగిరీ! మీ అబ్బాయి ఏ పుస్తకం చదువుతుండగా పట్టుబడ్డాడో ఒకసారి మన వాళ్ళందరికీ చెప్పు!" అన్నాడు శాయీరామ్.

యాదగిరి ఏదో మాట్లాడాలని తలెత్తి పెదాలు కదపడానికి ప్రయత్నించి కుదరక మళ్ళీ తలదించుకున్నాడు అవమానంతో.

"నేను చెప్పలేను. అడినే ఆగడండ్రి" అన్నాడు సిగ్గుతో.

"ఏరా శంకర్! నువ్ ఓవర్‌హెడ్ టాంక్ కింద ఎవరికీ కనబడకుండా కూర్చుని చదువుతున్న పుస్తకం ఏమిట్రా" అడిగాడు శాయీరామ్

"ఇంకెప్పుడూ చదవనంకుల్! నన్నొదిలేయండి" భయపడిపోతూ అన్నాడువాడు.

"నిన్నేమీ చేయలేం! పుస్తకమేదో చెప్పు!"

వాడు ఓ క్షణం తటపటాయించి చెప్పేశాడు "సత్యహరిశ్చంద్ర"

ఆ పేరు వింటూనే అందరూ ఉలిక్కిపడ్డారు.

చాలామంది తమకు తెలియకుండానే హాహాకారాలు చేశారు.

"అయ్యో! అయ్యో! వింటిరా? ఎంత పన్జేసిండో– సత్యహరిశ్చంద్ర చదివిండట! భగవంతుడా! ఇదేం కిరికిరి తెచ్చినావ్ స్వామీ–" అంటూ యాదగిరి భార్య బోరున ఏడ్చేయసాగింది. అందరూ ఆమెను అతికష్టం మీద ఓదార్చసాగారు.

"జరిగిన నష్టమేదో జరిగిపోయింది కదమ్మా! ఆ పిల్లాడిని ఎలా మళ్ళీ మంచి మనిషిగా చేయాలో ఆలోచించాలిగానీ ఏడుస్తే ఏం లాభం?" అంది సావిత్రమ్మ.

"ఊరుకోమ్మా! కాలం అలాంటాది! పిల్లల్నని ఏం లాభం? ఆ దిక్కుమాలిన పుస్తకాలు అమ్మినవాడిననాలి! ఎంత లాభసాటి వ్యాపారమయితే మాత్రం చిన్నపిల్లలని కూడా చూడకుండా అలాంటి బూతు పుస్తకాలమ్ముతాడా?" విరుచుకుపడింది పార్వతమ్మ.

"ఇంతకూ ఆ పుస్తకమంతా చదివేశాడా ఆ కుర్రాడు?" అడిగింది ఇంకొకామె.

శాయీరామ్ యాదగిరి వేపు చూశాడు.

"ఏమిరా! ఎన్నిదినాల కెళ్ళి సదువుతున్నావీ ఫాల్తూ పుస్తకం?" అడిగాడతను కోపంతోనూ బాధతోనూ.

"పదేను దినాలకెళ్ళి!"

అందరూ మళ్ళీ హాహాకారాలు చేశారు. "అయితే మొత్తం చదివేసి వుంటాడు! ఇంకెలా బాగుపడతాడు వీడు?" అంది సావిత్రమ్మ.

"అందులో కథంతా సదివినావురా?" అడిగాడు యాదగిరి మళ్ళీ

"అవ్! అంతా సదివినా!"

"గంటే- హరిశ్చంద్రుడు 'సత్యం' కోసం భార్యను అమ్మేసుకొనుడు కాటికాపరిగా పనిచేసుడు అన్నీ సదివినావులే!" మరింత గాబరాగా అడిగాడు.

"అవ్! కథ మొత్తం చదివినా! పాపం అరిశ్చంద్రుడు బాకీపైసలు తీర్చనని ఎంత పరేషానయిండో మంచిగా రాసిండు నాయనా?"

అందరూ మరింత జాలిగా చూశారు వాడివేపు.

"అదంతా చదివినాంక ఇప్పుడు నీకేమనిపిస్తుందిరా?"

వాడు భయపడుతూ అందరివేపూ చూశాడు.

"చెపితే నన్ను కొడతావు నువ్వు!" అన్నాడు అనుమానంగా.

"కొట్టదులే! కొడితే అడ్డుకునే పూచీనాది! చెప్పెయ్" అన్నాడు శాయీరామ్.

"నేను గూడా ఎన్నటికీ నిజమే మాట్లాడాలని వున్నదే" భయంగా అన్నాడు.

అందరూ నిర్ఘాంతపోయారు. వాళ్ళమ్మ బిగ్గరగా ఏడ్చేయసాగింది.

"నా బిడ్డ పూరా ఖరాబయిపోయిండు దేవుడో! ఈదినాల్ల 'నిజం' పలుకుతే ఏమయిపోతాడు దేవుడో! ఈడ్నింకెవరు బచాయిస్తరు దేవుడో!" అందరూ కలసి ఆమెను ఓదార్చసాగారు.

"ఏం చేస్తామమ్మా! నీ ఖర్మ అది ! వాడా పుస్తకం పూర్తిగా చదివేసాక ఇంక ఎవరేం జేయగలం చెప్పు! వాడి ఖర్మ వాడనుభవించాల్సిందే"

శాయీరామ్ మైక్ దగ్గర కొచ్చాడు మళ్ళీ.

"సోదరసోదరీమణులారా! యాదగిరి కొడుకు చదివిన దారుణమయిన సాహిత్యం గురించి, దానివల్ల సంభవించిన అనర్థం గురించీ విన్నారు. ఇప్పుడు గోపాల్రావ్ కూడా వాళ్ళబ్బాయిని అలాంటి సాహిత్యమే చదువుతూండగా రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్న విషయం గురంచి వివరంగా వివరిస్తారు" అన్నాడు.

మరుక్షణం గోపాల్రావ్ దీనంగా వేదికమీదకొచ్చాడు.

"గోపాల్రావ్‌గారూ! మీ అబ్బాయి కూడా మన సమాజం నిషేధించిన అశ్లీల పుస్తకాలు చదువుతూ పట్టుబడ్డాడని తెలిసింది నిజమేనా!" అడిగాడు శాయిరామ్.

"అవును!"

"ఏం పుస్తకం అది?" గోపాల్రావ్ మా మొఖాల్లోకి చూడలేక తలదించుకున్నాడు.

"భర్తృహరి సుభాషితాలు-సుమతీ శతకం"

ఆ మాట వింటూనే అందరూ "అయ్యే! అయ్యో- ఇదెక్కడి ఘోరం? మరీ భర్తృహరి సుభాషితాలా! మనరాష్ట్రం సర్వనాశనమయిపోతోంది" అనుకోసాగారు.

"ఎంతకాలం నుంచి వాడా పుస్తకం చదువుతున్నాడో కనుక్కున్నారా?"

"చెప్పుకుంటే సిగ్గుచేటు! పదిరోజుల్నుంచీ అవే పుస్తకాలు చదువుతున్నాడట."

అందరికీ గుండెలవిసి పోయినంత పనయింది.

"అమ్మో! పదిరోజుల్నుంచే? అన్ని రోజుల్నుంచీ అంత ప్రమాదకరమయిన నీతి పుస్తకాలు చదువుతూంటే మీరేం చేస్తున్నారు మరి?" చిరాకుపడ్డాడు చంద్రకాంత్.

"మాకేం తెలుసు! పైకి కనపించకుండా యండమూరి వీరేంద్రనాథ్, మల్లాది, యర్రం శెట్టిశాయి నవలల మధ్య పెట్టుకుని చదువుతున్నాట్ట. మేము పై నవలలు చూసి మంచి సాహిత్యమే చదువుతున్నట్లే అనుకుంటున్నాం! తీరా ఓరోజు ఆ పుస్తకం చదువుతూ చదువుతూనే నిదరపోయినప్పుడు లోపలున్న సుమతీశతకం కిందపడి అసలు రహస్యం బయటపడింది! అప్పుడు పట్టుకుని చావగొడితే భర్తృహరి సుభాషితాలు కూడా చదువుతున్నానని వప్పుకున్నాడు" దిగులుగా అన్నాడు గోపాల్రావ్.

"ఏం పోయేకాలమొచ్చింది ఈ కాలం పిల్లలకు? ఈనాటి సమాజంలో ఎలా బ్రతకాలో ఎలాంటి అవినీతి పనులు చేయాలో నేర్పే ఈ కాలం రచయితల అద్భుత ఉత్తమ సాహిత్యం చదవకుండా అలా నీతి, నియమం, మంచీనేర్పు ఆపాతకాలం నాటి బూతు సాహిత్యం చదువుతే ఏమయిపోతారు? అడుక్కు తినాల్సిందేగా?" అంది సావిత్రమ్మ.

ఈ చెత్తపుస్తకాలు చదివే కాబోలు, మావాడు మొన్న కాలేజ్ రోడ్‌మీదో అమ్మాయి ఎదురొస్తే, ఆ అమ్మాయి చెయ్యిపట్టుకోలేదు సరికదా! కనీసం కన్నూ గీటలేదట. మిగతా పిల్లలంతా రాగానే చెప్పారు. ఆ పిల్లకూడా పాపం ఇంటికెళ్ళి ఒకటే ఏడుపట- వీడు తననలా అవమానపరచాడని! వాళ్ళనాన్న మండిపడి వీడిమీద పోలీస్ కంప్లెయింట్ ఇస్తానని కూర్చుంటే మిగతా వాళ్ళందరూ సర్దిజెప్పి ఆపారట! ఇంకోసారి కూడా అలాగే నీతిగా ప్రవర్తిస్తే అప్పుడు వీడిపని పడదాం అన్నారట" అంది పార్వతీదేవి. రంగారెడ్డి కోపంగా లేచి నిలబడ్డాడు.

"వీళ్ళనిలా వదిలితే లాభంలేదు! మిగతా కాలనీ పిల్లలంతా కూడా రేపు అడివిబాపిరాజు పుస్తకాలు, గోపీచంద్, రాచకొండ విశ్వనాథశాస్త్రి సాహిత్యం, యోగివేమన శతకాలూ, గురజాడ అప్పారావ్ సాహిత్యం, మునిమాణిక్యం, చిలకమర్తివారి సాహిత్యం, కాశీపట్నం, మధురాంతకం రాజారాం కథలు, కొడవటిగంటి కుటుంబరావు నవలలు చదవడం మొదలు పెడితే వాళ్ళ భవిష్యత్తేమయిపోతుంది? ఆ సాహిత్యం ప్రభావం పడినీతిగా, బుద్ధిగా బ్రతుకుతామని మొండికేస్తే మనమేం చేయగలం?" ఆవేశంగా అన్నాడతను.

అందరికీ రక్తం ఉడికిపోతున్నట్లయింది. మరోపక్క పిల్లల పరిస్థితి తల్చుకుని భయం.

"అవును! మనం వీళ్ళనిలా వదిలేస్తే మనకే నష్టం! ఇంకోసారిలాంటి దిక్కుమాలిన లిటరేచర్ చదవకుండా కట్టడిచేయాలి!" అరిచాడు జనార్ధన్.

మిగతా పదిమంది కుర్రాళ్ళూకూడా ఒక్కరొక్కరే వేదిక మీదకెక్కి ఇంకెప్పుడూ అలాంటి బుద్ధి తక్కువ పని చేయమని చెంపలేసుకున్నారు.

వాళ్ళల్లో ఒకడు ఓ ప్రముఖ సెక్స్ వార పత్రిక అడ్డుపెట్టుకుని లోపలన చందమామ పుస్తకం చదువుతున్నాడట. మరొకడు స్త్రీ అంగాంగాలూ వర్ణిస్తూన్న సీరియల్స్ ప్రచురించే మరో తెలుగు వారపత్రిక అడ్డుగా పెట్టుకుని లోపల టామ్‌సాయర్, డాన్‌క్విక్సాట్, అల్లాడీన్ మాజిక్‌లాంప్, ట్రెజర్ అయ్‌లెండ్ లాంటి ఇంగ్లీషు పుస్తకాలు చదువుతున్నాడట.

ఇంకో కుర్రాడు బూతు మాసపత్రిక ఒకటి అడ్డుపెట్టుకుని లోపల పుష్పవిలాసం పద్యాలు చదువుతున్నాడట!

ఈ గొడవంతా చూసేసరికి ప్రేక్షకుల్లో నుంచి సరస్వతమ్మగారు ఏడుస్తూ వేదికమీద కొచ్చింది.

"ఈ పిల్లల పరిస్థితి చూస్తేనే గుండె పగిలి పోతోందంటే– మొన్న మా ఆయనేం చేశాడో తెలుసా అన్నయ్యగారూ?" అంటూ మళ్ళీ బావురుమంది.

"అరె ఏడుస్తావెందుకమ్మా! ఏం జరిగిందో చెప్పు!" ఓదార్చాడు శాయిరామ్.

"మొన్న–మొన్న నేను మార్కెట్ కెళ్ళి హఠాత్తుగా వచ్చి తలుపులు తెరిచేసరికి–" అంటూ మళ్ళీ వెక్కి వెళ్ళి ఏడవసాగింది.

"అరె! ఏడవకమ్మా! త్వరగా చెప్పు! ఏం చేశాడో?"

"నేను తలుపు తెరిచేసరికి– తెరిచేసరికి ఆయన తేనేటీగ, డెత్‌సెల్ పుస్తకాలు అడ్డుగ పెట్టుకుని" మళ్ళీ బావురుమందామె.

"చెప్పమ్మా! అవి అడ్డుగా పెట్టుకుని లోపల ఏ పుస్తకం చదువుతున్నాడు?" అడిగింది పార్వతీదేవి.

“వాడెవరో జులాయి రచయిత విష్ణుశర్మరాసిన ‘పంచతంత్రం’’ పుస్తకం చదువుతున్నారు” అందరి దృష్టి ఓ మూలగా పాలిపోయినా ముఖంతో కూర్చున్న సరస్వతమ్మ భర్తమీద పడింది. “ఏమయ్యా! పిల్లలకు చెప్పాల్సిందిపోయి ఎద్దులాగుండి నువ్వే అలాంటి క్షుద్ర సాహిత్యం చదువుతన్నావా? నీకేమయినా బుద్ధుందా?” రంగారెడ్డి విరుచుకుపడ్డాడతని మీద.

అతను దీనంగా లేచి నిలబడ్డాడు.

“పొరబాటయిపోయింది. ఇంకెప్పుడూ అలాంటి చెత్త చదవనని ప్రామిస్ చేస్తున్నాను. ఈ సారికి నన్ను క్షమించండి!” అన్నాడు తలవంచుకుని. క్షణాల్లో అంతా గందరగోళంగా తయారయింది.

అతనిని క్షమించడానికి వీల్లేదని కొంతమంది అరవసాగారు. అతను పశ్చాత్తాపం ప్రకటించే వరకూ తులసిదళం నవల పదే పదే చదివిస్తేగానీ తిరిగి దారిన పడడని మరికొంతమంది సలహా ఇచ్చారు. చివరకు శాయిరామ్ జోక్యం చేసుకోక తప్పలేదు. వెంటనే మైక్ దగ్గరకొచ్చాడు.

“సోదరసోదరీమణులారా! మన సమాజం ఎంతో ప్రగతి సాధించిందని మనం అనుకోవడమేగాని నిజానికి ఎన్ని తప్పుదారులు తొక్కుతోందీ, ఎంతవెనక్కు లాగుతోంది–ఇవాళ ఈ సంఘటనలు ఋజువుచేస్తున్నాయ్. కనుక మనం వ్యక్తుల్ని శిక్షించడం కంటె మరోసారి ఇలాంటి దారుణాలు జరగకుండా చర్యతీసుకోవడం మంచిదని నా అభిప్రాయం. ఈ విషయంలో మీ మా సలహాలు తెలియజేస్తే వాటిల్లో ఆచరణ యోగ్యంగా వున్న వాటిని స్వీకరించి అమలు పరచేందుకు మన ప్రయత్నాలు మనం చేయవచ్చు” అన్నాడతను. అందరూ రకరకాల సలహాలు ఇవ్వడం మొదలుపెట్టారు.

“ఇక నుంచి అలాంటి పాతకాలం సాహిత్యం చదువుతూ పట్టుబడ్డవాళ్ళని సామాజిక బహిష్కరణ చేయాలి” అన్నాడు బాబు.

“వాళ్ళమీద మనం కేసులు పెట్టి జైలుకి పంపాలి!” అన్నాడు చంద్రకాంత్.

“నన్నడిగితే ఈ గొడవంతా పడే బదులు ఆ సాహిత్యాన్ని మన ప్రభుత్వంతో నిషేధింపజేయాలి” అన్నాడు రంగారెడ్డి. మరుక్షణంలో తప్పట్లు మార్మోగిపోయినయ్.

“రంగారెడ్డి సలహా బాగుంది! వెంటనే మనమంతా గవర్నర్ ఇంటికి ఊరేగింపుగా వెళ్ళి ఆ చెత్త సాహిత్యాన్ని నిషేధించమని అర్జీ సమర్పించుకోవాలి!” అంటూ అరిచారు అందరూ. అప్పటికప్పుడే అర్జీ తయారుచేయడంలో నిమగ్నమయిపోయాం అందరం.